క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు


మందమర్రిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మందమర్రిరూరల్/దండేపల్లి/నెన్నెల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మందమర్రిలో నాయకులు జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. నెన్నెల మండలంలోని జంగాల్‌పేటలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు వేల్పుల ఉదయ్‌కిరణ్ జెండా ఆవిష్కరించారు. నాయకులు వేల్పుల భీమేశ్, ఇప్ప లచ్చయ్య, వేల్పుల బాపు, ఇప్ప మారయ్య, రాజు, శ్రీను, వేల్పుల సతీశ్, అనిల్, రాజనర్సు, రవి, సదానందం, సంపత్, రవికుమార్, సతీశ్, శివాజీ, దుర్గాప్రసాద్, సతీశ్, విశాల్, లచ్చన్న, నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

లక్సెట్టిపేట: మండలంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాజభజంత్రీలు, డప్పుచప్పుళ్ల మధ్య మత్స్యకారులు, మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. గోదావరి నది వద్ద గంగమ్మతల్లి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజల్లో పాల్గొన్నారు.

భీం విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానం

పాతమంచిర్యాల: ఈనెల 9న లక్సెట్టిపేటలోని కరీంనగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఎమ్మెల్యే దివాకర్‌రావుకు ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ నాయకుడు గుర్రాల వేణు శుక్రవారం ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమానికి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, డీటీడీవోలు హాజరవుతారని పేర్కొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

తాండూర్(బెల్లంపల్లి): అధైర్య పడకండి అండగా ఉంటామని బిడ్డను పోగొట్టుకున్న జాడి కిషన్, కళావతి దంపతులకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.హరీశ్‌గౌడ్ భరోసా ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రం ఐబీ కొత్త గుడిసెల ప్రాంతంలో నివాసం ఉంటున్న బాధిత దంపతుల ఇంటికి వెళ్లి ఆయన పరామర్శించారు. బీజేపీ నాయకులు కోడి రమేశ్, విష్ణు కళ్యాణ్, భాస్కర్ గౌడ్, లక్ష్మణ్, రమేశ్ ఉన్నారు.

కుట్టుశిక్షణతో ఉపాధి

లక్సెట్టిపేట: మహిళలు కుట్టుశిక్షణ నేర్చుకోవడంతో ఉపాధి పొందవచ్చునని డీఈవో యాదయ్య అన్నారు. మండలంలోని చందారంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు సౌజన్యంతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వందశాతం అక్షరాస్యత కలిగిన గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన రంగవల్లి ముగ్గులను పరిశీలించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా వయోజన విద్యాఇన్‌చార్జి పురుషోత్తం నాయక్, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఉమ్మడి జిల్లా కన్వీనర్ రెడ్డిమల్ల ప్రకాశం, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల కార్యవర్గం

జైపూర్: ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా షెట్‌పల్లికి చెందిన జి.వెంకటేశం, ప్రధానకార్యదర్శిగా బి.రమేశ్, ఉపాధ్యక్షులుగా బి.నరేశ్, కోశాధికారిగా వి.రవికిరణ్, సహాయకార్యదర్శిగా ఎన్.రమేశ్ ఎన్నికయ్యారు. జిల్లా కోశాధికారి రాజేందర్, సహాయ కార్యదర్శి రాజు, మూర్తి, సలహాదారు శంకరయ్య, ప్రచారకార్యదర్శి రమణాచారి పాల్గొన్నారు.

అతివల ఆరోగ్యమే లక్ష్యంగా..

- ఆరోగ్య మహిళ కార్యక్రమం
- ఎనిమిది రకాల సేవలతో 57 రకాల పరీక్షలు
- మొదటి దశలో నాలుగు పీహెచ్‌సీలు

జన్నారం: అతివల ఆరోగ్యంపై సర్కారు దృష్టి పెట్టింది. వివిధ రుగ్మతలను గుర్తించేందుకు ఆరోగ్య మహిళ అనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించింది. ఇందుకు నాలుగు మండలాల్లో పీహెచ్‌సీలను ఎంపిక చేసింది. కుందారం, తాళ్లగురిజాల, సాయికుంట బస్తీ దవాఖానా, జన్నారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది. వీటిలో ఇకపై సాధారణ ఓపీతోపాటు ప్రతీ మంగళవారం 18ఏళ్లు పైబడిన అమ్మాయిలు, మహిళలు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్నారు. ఆరోగ్య మహిళ పేరిట నిర్వహించే ఈ కార్యక్రమం కింద ఎనిమిది రకాల సేవలతో పాటు 57 రకాల పరీక్షలు చేస్తారు. మహిళలకు విటమిన్ బీ12, విటమిన్ డీ 3, మధుమేహం, రక్తపోటు, పరీక్షలు చేస్తారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ నిర్వహిస్తారు. వీటిలో ఏమైనా లక్షణాలు కనిపిస్తే సదరు మహిళలను జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. థైరాయిడ్, అయోడిన్, రక్తహీనతతోపాటు బాధపడే వారిని గుర్తిస్తారు. మూత్రకోశ సమస్యలు, మెనోపాజ్‌కు సంబంధించిన పరీక్షలు చేసి అవసరమైన వారికి సూచనలు ఇస్తారు. జిల్లాలోని ఆరోగ్య మహిళ సేవలను అందించే వైద్యులు, సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

జిల్లాలో 3500 మందికి పరీక్షలు

ఆరోగ్య మహిళ కింద జన్నారం మండలంలోని పీహెచ్‌సీలో 17 వారాల్లో 1014 మందికి పరీక్షలు చేశారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు పీహెచ్‌సీల్లో 3500 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రతీ మంగళవారం ఓపీ సంఖ్య పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఇందులో 1800 మంది మహిళల రక్త నమూనాలు సేకరించి వివిధ రకాల పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆరోగ్య మహిళ కార్యక్రమంతో మహిళలకు ముందు జాగ్రత్తగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించడంతో మంచి జరుగనుంది. ఈ కార్యక్రమంపై మండలంలో ప్రచారం లేక ఇంకా చాలామందికి ఈ విషయంపై అవగాహన రావడం లేదు. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మహిళలకు ఉపయోగం

ఆరోగ్య మహిళ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగం. వారికి సొంత సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తారు. రొమ్ముక్యాన్సర్, ఇతర వ్యాధులు సోకితే వైద్య చికిత్స అందిస్తారు. అందుబాటులో లేని వాటిపై రెఫర్ చేస్తారు. ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్నాక మహిళల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ మంగళవారం మహిళలు, యువతులు వచ్చి పరీక్షలు నిర్వహించుకుంటున్నారు.

– డా. నీరజ, జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జి

పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె


నెన్నెలలో సమ్మె చేస్తున్న కార్మికులు


జైపూర్: నిరవధిక సమ్మెలో కార్మికులు

నెన్నెల/మందమర్రిరూరల్/జైపూర్/భీమారం/మంచిర్యాలరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్మికులు శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయాల ఎదుట తమ నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనాలు చెల్లించాలని, 51 జీవో రద్దు చేసి మల్టీ పర్పస్ విధానం తొలగించాలని డిమాండ్ చేశారు. నెన్నెలలో సమ్మె మద్దతుగా తెలంగాణ జేఏసీ మండల కన్వీనర్ రణవీర్‌సింగ్ పాల్గొన్నారు. భీమారంలో సమ్మెకు దిగుతున్నట్లు కార్మికులు ఎంపీవో సతీశ్‌రెడ్డికి తెలిపారు.

వంటావార్పుతో ఆదివాసీల నిరసన


నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

కోటపల్లి: మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన 60 మంది ఆదివాసీలకు పోడు పట్టాలు రాకుండా చేసిన అధికారుల తీరుపై కొనసాగుతున్న నిరసన శుక్రవారం నాలుగోరోజుకు చేరింది. పోడు భూముల్లోనే ఆదివాసీలు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్‌ఆర్‌సీ కమిటీ చైర్మన్ నైతం మహేశ్, నాయకులు రాజేశ్, సంతోష్, సాయిచరణ్, శ్రావణ్, సమ్మన్న, మాణిక్యం, రజిని పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ముంపు ప్రాంతాలుగా గుర్తించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని రాపల్లి ఎస్సీ కాలనీ, పడ్తనపల్లి ఎస్సీ కాలనీలను ఎల్లంపల్లి ముంపు ప్రాంతాలుగా గుర్తించాలని కోరుతూ మంచిర్యాలలో రాష్ట్ర ఫిలిం బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూస్కూరు రామ్మోహన్‌రావుకు బాధితులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని విన్నవించారు. 2016లో త్రిమెన్ కమిటీ ముంపు ప్రాంతంగా గుర్తించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తమకు ఎలాంటి పరిహారం, పునరావాసం అందలేదని విన్నవించారు. రైతుబంధు సమితీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు శంకరయ్య, లింగయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు


నస్పూర్: భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే


రాపల్లిలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నస్పూర్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో రూ.41 లక్షల నిధులతో నిర్మించనున్న ఎంఈవో కార్యాలయ భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.20 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా సీఎం కేసీఆర్ గురుకులాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, ఎంఈవో పోచయ్య, మున్సిపల్ కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు శీపతి సుమతి, వంగ తిరుపతి, పూదరి కుమార్ బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు సంతోష్‌చారి, రాజేంద్రపాణి, వేల్పుల రాజేశ్, భీమయ్య, కమలాకర్‌రావు, కాటం రాజు, మధుకర్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీ భవన నిర్మాణానికి భూమిపూజ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాపల్లిలో ఎమ్మార్సీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం భూమి పూజ చేశారు. రాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.41 లక్షల విద్యాశాఖ నుంచి మంజూరైన నిధులతో ఎమ్మార్సీ భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ స్వర్ణలత, సర్పంచ్ మల్లేశ్, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల శ్రీనివాస్, జీవన్‌రావు, నాయకులు శ్రీనివాస్, శంకరయ్య, బుచ్చయ్య, అబ్దుల్లా, కిష్టయ్య, ఎంఈవో పోచయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని 10వ వార్డులో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.32 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, కౌన్సిలర్ లావణ్య నగేష్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

10 నుంచి మొక్కల పంపిణీ

చెన్నూర్: హరితహారంలో భాగంగా మున్సిపాలిటీలో ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు వార్డుల వారీగా మొక్కల పంపిణీ ప్రారంభించనున్నట్లు కమిషనర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఈ ఏడాది 66 వేల మొక్కల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

పార్ట్‌టైం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టళ్లలో పని చేస్తున్న డైలీ వేజ్, పార్ట్‌టైం వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లోని డీటీడీవో కార్యాలయంలోని ఏవోకి వినతిపత్రం అందజేశారు. వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 11న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామన్నారు.

అదనపు దహన వాటికలు ప్రారంభం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గోదావరి రోడ్‌లోని శ్మశానవాటికలో నిర్మించిన మూడు అదనపు దహన వాటికలను మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య శుక్రవారం ప్రారంభించారు. పట్టణానికి చెందిన దాతలు పుస్కూరి రంగారావు రూ.3 లక్షలు, పాటిబండ్ల శ్రీరామ్మూర్తి రూ.2 లక్షలు, సాన అనూష్ రూ.లక్షతో అదనపు దహన వాటికల పనులు చేపట్టినట్లు తెలిపారు. వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు చంద్రయ్య, కమలాకర్‌గౌడ్, రమేశ్ ఉన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ముదిరాజ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సంఘం నాయకులు ఎమ్మెల్యే దివాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సతీశ్, ప్రచార కార్యదర్శి రాజేశం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాసిపేట: మండలంలోని కొండాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, సరఫరా ఫీడర్ల మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ స్వర్ణలత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్యశాఖ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ పేర్కొన్నారు. వేంపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి లహరి, కార్యదర్శి ప్రతిభ ఉన్నారు.

కొత్తమామిడిపల్లిలో బీఆర్‌ఎస్ పాదయాత్ర

దండేపల్లి: కొత్తమామిడిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు తనయుడు విజిత్‌రావు పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి, బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

కాసిపేట: కొత్త తిరుమలాపూర్, పాతతిరుమలాపూర్, కొలాంగూడ ఆదివాసీ విద్యార్థులకు శుభి సహాయ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు.

'ప్రైవేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలి'

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఇంటర్నేషనల్ స్కూల్ అంటూ ప్రచారం చేస్తున్న అల్ఫోర్స్ పాఠశాలపై చర్య తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా నాయకుడు నాగేంద్రప్రసాద్ కోరారు. డీఈవో యాదయ్యకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రామకృష్ణాపూర్: గద్దెరాగిడిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలు, వుమెన్ సేఫ్టీ, షీటీమ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణ ఎస్సై అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే మంచి లక్ష్యాలను ఏర్పరుచుకొని పట్టుదలతో చదవాలని అన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: జిల్లాలోని విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి చరణ్, డి.శ్రీకాంత్ శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సూపరింటెండెంట్ విజయనందంకు వినతిపత్రం అందజేశారు.

కంది విత్తనాలు పంపిణీ

కాసిపేట: రొట్టెపల్లిలో బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ఐటీడీఏ సహకారంతో23 మంది కొలాం గిరిజనులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. కోఆర్డినేటర్ రాజేశ్వర్‌నాయక్, శివప్రసాద్, ఏఈవో అంజలి, తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హన్మంతు, ఉపసర్పంచ్ గంగు, ఆదివాసీ విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్ ఉన్నారు.

రేపు గురుపూజోత్సవం

మంచిర్యాలఅర్బన్: తపస్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన ఉత్తమ గురువులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి హాజరవుతారన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

కార్మికులకు ఇంటి స్థలం ఇవ్వాలి


కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు శంకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 40 ఏళ్లుగా పనిచేసిన రిటైర్డ్ అయిన తర్వాత సొంతిల్లు కట్టుకోలేకపోతున్నారని, పెరిగిన భూమి ధరలకు ఇంటి స్థలం రిటైర్మెంట్ డబ్బులకు రావడం లేదన్నారు. కంపెనీ వద్ద వందలాది ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రతి కార్మికుడికి 250 గజాల ఇంటి స్థలంతోపాటు రూ. 25 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శీలం చిన్నయ్య, నాయకులు జాన్సన్, సమ్ము రాజయ్య, వెంకటేశ్వర్లు జీవన్‌రావు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల సదస్సు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మేకల దాసు

పాతమంచిర్యాల: కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంచిర్యాలలో ఈనెల 12న నిర్వహించే కార్మిక సంఘాల సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు కోరారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపు మేరకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తోకల తిరుపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి రాంమడుగు లక్ష్మణ్, నాయకులు దేవీ పోచన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో గత కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడంలో కార్మిక సంఘాలు విఫలమయ్యాయని ఆరోపించారు. డిస్మిస్ కార్మికులకు షరతులు లేకుండా ఉద్యోగావకాశం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. రాములు, పోచమల్లు, రవీందర్, రత్నకుమార్ ఉన్నారు.

లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల్లో 35 శాతం వాటా రూ.700 కోట్లు ఆగస్టులో ఉద్యోగులకు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–5 గని వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ సింగరేణికి విద్యుత్ సంస్థ రూ.1800 కోట్లు బకాయిలు ఉందని, ప్రభుత్వం బాధ్యత తీసుకుని వెంటనే వసూళ్లు చేయాలన్నారు. అదేవిధంగా కార్మికులకు మెరుగైన పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటస్వామి రాజేంద్రప్రసాద్, స్వామి తదితరులు ఉన్నారు.

నష్టపరిహారాలు ఇప్పించాలి

శ్రీరాంపూర్: తమకు రావాల్సిన నష్టపరిహారాలను ప్రభుత్వంతో మాట్లాడి ఇప్పించాలని తాళ్లపల్లి గ్రామ ఓసీపీ భూ నిర్వాసితులు కోరారు. మంచిర్యాలలోని రాష్ట్ర ఫిల్మ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాంమోహన్‌రావును శుక్రవారం ఆయన నివాసంలో కలిసి వారి సమస్యలను వివరించారు. భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేశ్‌యాదవ్, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కమిటీ

జైపూర్: జైపూర్ మండలం ఇందారం ఐకే–1ఏ గని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు కన్వీనర్ ప్రవీణ్ తెలిపారు. పిట్ సెక్రెటరీగా మహేందర్, అసిస్టెంట్ సెక్రెటరీగా వెంకటేశ్వర్లు, జనరల్ షిఫ్ట్‌గా ఇన్‌చార్జిగా శ్రీనివాస్, రిలే ఇన్‌చార్జీలుగా ప్రభుదాస్, రాజు, అడ్వైజర్‌గా సురేశ్, అశోక్, ట్రెజరర్‌గా విజయ్ ఎన్నికయ్యారు. నాయకులు నర్సింగారావు, వాసు, శంకరయ్య, మురళీ పాల్గొన్నారు.


మూడో రోజుకు సమ్మె

కాసిపేట: మందమర్రి ఏరియా కేకే ఓసీలో ఆర్‌వీఆర్ సంస్థ డ్రైవర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు డ్రైవర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడోరోజు చేరింది. అధికారులు, ఎమ్మెల్యే సంప్రదించే ప్రయత్నం చేసినా సదరు సంస్థ అధికారి స్పందించక పోవడంతో సమ్మె కొనసాగింది. శుక్రవారం జాగృతి నాయకులు, బీఎస్పీ నాయకులు వారికి మద్దతు ప్రకటించారు.

19న కళోత్సవం

శ్రీరాంపూర్: సింగరేణి కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని సీఈఆర్ క్లబ్‌లో ఈనెల 19న నిర్వహించే కళోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ అధ్యక్షుడు సతీశ్‌కుమార్ కోరారు. శుక్రవారం నస్పూర్ కాలనీలోని సింగరేణి సేవాభవన్ వద్ద కళాకారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై ఇందులో చర్చించారు. కళాకారులు రాయలింగు, పెద్దయ్య, చంద్రమోహన్, సతీశ్, కిరణ్, నరసయ్య తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులకు నిరసనగా సీపీఐ రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి: ప్రధాని మోదీ వరంగల్ పర్యటన పురస్కరించుకుని నిరసన కార్యక్రమం నిర్వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ప్రజా సంఘాల బాధ్యులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ శుక్రవారం బెల్లంపల్లిలో నాయకులు రాస్తారోకో చేశారు. బజారుఏరియాలోని సర్దార్ భగత్‌సింగ్ విగ్రహం ఎదుట ప్రధాన రహదారిపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. అరెస్టులను సీపీఐ అసెంబ్లీ నియోజవకర్గ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ ఖండించారు. ఎం.వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, బియ్యాల ఉపేందర్, బి.లక్ష్మీనారాయణ, ఆడేపు రాజమౌళి, ఎల్తూరి శంకర్, దాసరి తిరుపతిగౌడ్, రత్నంరాజం, ఐలయ్య, బాలయ్య, తిరుమలేష్, శంకర్, ప్రణీత్‌కుమార్ పాల్గొన్నారు.


నేడు పోడు పట్టాల పంపిణీ

వేమనపల్లి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో శనివారం పోడు పట్టాలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు పోడు పట్టాలు అందిస్తారని పేర్కొన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు తరలిరావాలని కోరారు.

ఈఎంఆర్‌ఐలో ఉద్యోగావకాశాలు

పాతమంచిర్యాల: ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ కాల్ సెంటర్‌లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఆఫీసర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పైలెట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్‌ఐ మంచిర్యాల బ్రాంచ్ ప్రోగ్రాం మేనేజర్ బీ సామ్రాట్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఆఫీసర్ కోసం డిగ్రీ పాసై 30 ఏళ్లలోపు ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసి ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోసం డిగ్రీ లైఫ్ సైన్స్, ఎంఎల్‌టీ, జీఎస్‌ఎం కోర్సు పాసై 30 ఏళ్ల లోపు ఉండాలని సూచించారు. పైలెట్ ఉద్యోగం కోసం పదో తరగతి పాసై 30 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఎత్తు 5.4 అంగుళాలు ఉండి, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని 108 కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 9154 731834 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం కేటాయించాలి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మురళి

పాతమంచిర్యాల: మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహ ప్రతిష్ఠాపన కోసం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో స్థలం కేటాయించాలని హైదరాబాద్‌లో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ బీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌కు తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళి వినతిపత్రం అందించారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడతామని కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ హామీ ఇచ్చారని మురళి తెలిపారు. తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షుడు రమేశ్, మాజీ కార్పొరేట్ కంపెనీకి రమేశ్, బీసీ నాయకులు ఆనంద్‌గౌడ్, కిశోర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.